నమస్తే తెలంగాణ
మెదక్
13 | హైదరాబాద్, శనివారం 20 జనవరి 2024 | MEDAK

మల్లన్న జాతరొచ్చింది..

విద్యుత్ దీపాల వెలుగులో మల్లన్న ఆలయ రాజగోపురం

రేపటి నుంచి పట్నం వారం

ఉత్సవాలకు సిద్ధమైన కొమురవెల్లి క్షేత్రం

మొదటి వారానికి 50వేలకు పైగా భక్తుల రాక

చేర్యాల, జనవరి 19 : కొమురవెల్లి మల్లికార్జున స్వామి క్షేత్రం ఉత్సవాలకు సిద్ధమైంది. జనవరి 7న నిర్వహించిన కల్యాణోత్సవాన్ని ఆలయవర్గాలు అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఆలయ ఆచార, సంప్రదాయాల ప్రకారం సంక్రాంతి తర్వాత వచ్చే మొదటి ఆదివారంతో స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. బ్రహ్మోత్సవాల్లో స్వామివారి కల్యాణం, పట్నం వారం, లష్కర్‌వారం, మహా శివరాత్రి రోజున పెద్ద పట్నం, అగ్నిగుండాల కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆదివారం పట్నంవారంతో ఉత్సవాలు ప్రారంభమై 12 ఆదివారాలు కొనసాగనున్నాయి.

పెద్దపట్నం, అగ్నిగుండాలు

ఈ నెల 22న స్వామి వారి కల్యాణ వేదిక వద్ద పెద్దపట్నం, అగ్నిగుండాల కార్యక్రమాన్ని హైదరాబాద్ ఒగ్గు పూజారుల ఆధ్వర్యంలో ఆలయవర్గాల పర్యవేక్షణలో నిర్వహించనున్నారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్న అనంతరం కొండపోచమ్మ, నల్లపోచమ్మ ఆలయాల వద్దకు వెళ్లి అక్కడ బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారని ఆలయ ఈవో ఎ.బాలాజీ, చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి తెలిపారు.

పట్నం వారానికి హైదరాబాద్ భక్తులు

పట్నం వారం హైదరాబాద్‌కు చెందిన భక్తులు కొమురవెల్లి క్షేత్రానికి తరలివచ్చి మల్లన్న స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకోనున్నారు. హైదరాబాద్‌కు చెందిన భక్తులు మల్లన్నపేరిట సట్టీ దీక్షలను 41 రోజులు నిర్వహించి, పట్నం వారం స్వామి వారిని దర్శించుకుని, దీక్షలు విరమించనున్నారు. అనంతరం గుట్ట పై ఎల్లమ్మ తల్లికి బోనం సమర్పించనున్నారు. పట్నం వారం సందర్భంగా ఆలయ అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. అదనపు డీసీపీ మహేందర్ ఆధ్వర్యంలో హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి, కొమురవెల్లి ఎస్సై నాగరాజు పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

'మల్లన్న' ఆలయ ఏఈవోకు డిప్యుటేషన్

కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ ఏఈవో వైరాగ్యం అంజయ్యను మెదక్ దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయానికి డిప్యుటేషన్ వేస్తూ దేవాదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ అనిల్‌కుమార్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల మల్లన్న ఆలయ పునరుద్ధరణ కమిటీ సభ్యులు కొందరు ఏఈవోపై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం కమిషనర్ ఈ నిర్ణయం తీసుకున్నారు.

అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవాలి

- వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

సంగారెడ్డి, జనవరి 19: సంగారెడ్డి జిల్లాలోని అక్రమ మైనింగ్ ప్రాంతాలు గుర్తించి చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలోని పలు చోట్ల ప్రభుత్వ భూములు, నీటి వనరులు కబ్జాకు గురివుతున్నాయని, వాటిని పరిరక్షించాలని ఆదేశించారు. కలెకర్ ఆధ్వర్యంలో ఒక కమిటీ ఏర్పాటు చేసి భూకబ్జాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. అక్రమ మైనింగ్‌లపై నమోదు చేసిన కేసులను 15 రోజుల్లోగా అందించాలని ఏడీని ఆదేశించారు. జిల్లాలో బెల్ట్‌షాపులు ఉండొద్దని, అన్నింటినీ మూసేయించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వసతి గృహాల్లోని సమస్యలు పరిష్కరించాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో వసతులు, సిబ్బంది, భవనాల వివరాలు తెలుసుకున్నారు. వ్యవసాయ, ఉద్యాన, చక్కెర, పౌరసరఫరాలు, వైద్యారోగ్య, పశుసంవర్దక, మత్స్య, ఎస్సీ కార్పొరేషన్, మైనార్టీ శాఖలపై మంత్రి సమీక్షించారు. సమావేశంలో కలెక్టర్ వల్లూరి క్రాంతి, ఎస్పీ చెన్నూరి రూపేశ్, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్‌డీవో, ఆర్డీవోలు పాల్గొన్నారు.

పదిలో 100శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

మెదక్ రూరల్, జనవరి 19: పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు పని చేయాలని మెదక్ కలెక్టర్ రాజర్షి షా సూచించారు. శుక్రవారం మాచవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డీఈవో రాధాకిషన్‌తో కలిసి పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతి ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు తల్లిదండ్రులు ఇంటి వద్ద తీసుకోవాల్సిన చర్యలు, విద్యార్థుల సన్నద్ధతపై సలహాలు, సూచనలు చేశారు. పిల్లలను టీవీ, ఫోన్లకు దూరంగా ఉంచాలని, తరగతి గదిలో ఉపాధ్యాయులు విద్యార్థులను నిరంతరం పర్యవేక్షించాలని పేర్కొన్నారు. సమావేశంలో ఎంఈవో నీలకంఠం, సర్పంచ్ సంధ్యారాణి శ్రీనివాస్ చౌదరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



హైదరాబాద్ తెలంగాణ భవన్ రిజిస్టర్‌లో సంతకం చేసిన అనంతరం మెదక్ పార్లమెంట్‌కు సంబంధించిన బుక్‌లెట్‌ను అందుకుంటున్న హరీశ్‌రావు

మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

మెదక్‌లో ఎగిరేది గులాబీ జెండానే

మెతుకుసీమ బీఆర్ఎస్ కంచుకోట

- మనం బలంగా ఉన్నాం.. ఎంపీ ఎన్నికల్లో సత్తాచాటుదాం
- కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలను ఎండగట్టాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- పార్లమెంట్ ఎన్నికల్లో కార్యకర్తలు సింహాలై గర్జించాలి
- పోలీస్‌దాడులు, కేసులు, జైళ్లకు భయపడం
- ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటాం
- సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు
- తెలంగాణ భవన్‌లో మెదక్ పార్లమెంట్ సన్నాహక సమావేశం
- హాజరైన పార్టీ జిల్లాల అధ్యక్షులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జడ్పీ చైర్‌పర్సన్లు, ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు
- అగ్రనేతల దిశానిర్దేశంతో క్యాడర్‌లో జోష్

సిద్దిపేట, జనవరి 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం గులాబీ పార్టీకి కంచుకోట అని, రానున్న ఎన్నికల్లో మరోసారి గులాబీ జెండా ఎగురవేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుతో కలిసి కేటీఆర్ హాజరై పార్టీ క్యాడర్‌కు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ కార్యకర్తలు ఎవరూ అధైర్యపడొద్దన్నారు. రెట్టించిన ఉత్సాహంతో పనిచేసి మెదక్ ఎంపీ స్థానాన్ని భారీ మెజార్టీతో గెలువాలని పిలుపునిచ్చారు. మెదక్ ఎంపీ స్థానం పరిధిలో మొత్తం ఏడు అసెంబ్లీ స్థానాలు ఉండగా, గత శాసనసభ ఎన్నికల్లో ఏడింటికి ఆరు చోట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గెలుపొందారన్నారు. ఈ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అన్ని శాసనసభ స్థానాల్లో కలిపి 2,80,000 ఓట్ల మెజార్టీ సాధించి ఆధిక్యంలో ఉన్నామని చెప్పారు. మొన్నటి శాసనసభ ఎన్నికల్లో మోసపూరిత వాగ్దానాలతో కాంగ్రెస్ గద్దెనెక్కిందని, కాంగ్రెస్ మోసపూరిత విధానాలను ఎండగట్టాలని క్యాడర్‌కు కేటీఆర్ పిలుపునిచ్చారు. గడిచిన పదేండ్లలో పార్లమెంట్‌లో తెలంగాణ తరపున గళం విప్పింది బీఆర్ఎస్ ఎంపీలు మాత్రమే అన్నారు. విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేది బీఆర్ఎస్ మాత్రమేనని, మనం లేకపోతే తెలంగాణ ప్రయోజనాలకు నష్టం జరుగుతుందని కేటీఆర్ చెప్పారు.

ఎంపీ ఎన్నికల్లో కార్యకర్తలు సింహాలై గర్జించాలి

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కార్యకర్తలు కసితో పనిచేయాలని, సింహాలై గర్జించాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఈ సన్నాహక సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. కార్యకర్తలు కష్టపడి పని చేసి మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఏడింటికి ఆరు అసెంబ్లీ సీట్లు గెలిపించారన్నారు. మెదక్ అసెంబ్లీ సీటును తక్కువ ఓట్లతో కోల్పోయామని తెలిపారు. మెదక్ పరిధిలో ఎక్కువ సీట్లు గెలిపించి కేసీఆర్ పేరును కార్యకర్తలు నిలబెట్టారని, అందరికీ శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని, ఈ ఓటమి తాత్కాలికమే ..శాశ్వతం కాదన్నారు. గెలిచినప్పుడు పొంగి పోలేదని ..ఇప్పుడు కుంగిపోయేది లేదన్నారు. కేసీఆర్ ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. ఎన్నో అవమానాలు భరించి తెలంగాణ సాధించారన్నారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు విలువైన సూచనలు చేశారని, వాటిని కచ్చితంగా అమలు చేస్తామని చెప్పారు. కేసీఆర్ పథకాల అమలుకు పోటీపడితే, ఇప్పుడు కాంగ్రెస్ వాళ్లు అక్రమ కేసుల బనాయింపుల్లో పోటీ పడుతున్నారని ఎద్దేవా చేశారు. పోలీసులను వాడుకుని బీఆర్ఎస్ కార్యకర్తలను భయభ్రాంతులను గురిచేస్తున్నారని, పోలీస్‌స్టేషన్లు, జైళ్లు, పోరాటాలు మనకు కొత్త కాదని హరీశ్‌రావు అన్నారు. ఒక్క కార్యకర్తకు ఏం జరిగినా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అండగా ఉంటారని, భరోసా ఇచ్చారు. బీజేపీకి బీఆర్ఎస్ బీ టీం అనే దుష్ప్రచారాన్ని కార్యకర్తలు గట్టిగా తిప్పికొట్టాలన్నారు.మెదక్ పార్లమెంట్ సీటును బీఆర్ఎస్ భారీ మెజార్టీతో గెలవాలని పిలుపునిచ్చారు. ఎవరూ అధైర్య పడవద్దని, భవిష్యత్‌లో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని గుర్తుచేశారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత నిజమైన మార్పు వస్తుందని, సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారాన్ని తిప్పికొడదామని పార్టీ క్యాడర్‌కు హరీశ్‌రావు పిలుపునిచ్చారు.

బీఆర్ఎస్ క్యాడర్‌లో జోష్

తెలంగాణ భవన్‌లో జరిగిన మెదక్ పార్లమెంట్ సన్నాహక సమావేశం బీఆర్ఎస్ క్యాడర్‌లో జోష్‌ను నింపింది. కేటీఆర్, తన్నీరు హరీశ్‌రావు దిశానిర్దేశం చేయడంతో క్యాడర్ రెట్టించిన ఉత్సాహంతో ఉన్నారు. ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర పార్టీ సీనియర్ నాయకులు మాట్లాడారు. సమావేశంలో ఆయా శాసనసభ నియోజకవర్గాలకు చెందిన పార్టీ నాయకుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. మొన్నటి శాసనసభ ఎన్నికల్లో కొన్నిచోట్ల ఓడిపోవడానికి గల కారణాలను విశ్లేషించారు. పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. బీఆర్ఎస్ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని, ఎవరూ అధైర్యపడొద్దు అని కేటీఆర్, హరీశ్‌రావు భరోసా ఇచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గూడెం మహిపాల్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, శేరి సుభాష్‌రెడ్డి, వంటేరు యాదవరెడ్డి, వెంకట్రామ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, జడ్పీచైర్‌పర్సన్లు వేలేటి రోజాశర్మ, మంజుశ్రీ, హేమలత, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి, నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, వంటేరు ప్రతాప్‌రెడ్డి, గాలి అనిల్‌కుమార్, సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, మెదక్, నర్సాపూర్, సంగారెడ్డి, పటాన్‌చెరు నియోజకవర్గాలకు చెందిన పార్టీ ముఖ్యనేతలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజాప్రతినిధులు, నాయకులు, ముఖ్య నేతలు

టెక్నో ఫెయిర్ అదుర్స్

కంది ఐఐటీహెచ్‌లో అట్టహాసంగా ప్రారంభమైన ఇన్వెంటివ్-2024

ప్రారంభించిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

120 నూతన ప్రదర్శన, ఆవిష్కరణలను తిలకించిన కేంద్ర మంత్రి

ఆకట్టుకున్న ఐఐటీ, ఐఐఐటీ, ఎన్ఐటీలు

సంగారెడ్డి జనవరి 19 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లా కందిలోని ప్రముఖ సాంకేతిక విద్యాసంస్థ ఐఐటీ హైదరాబాద్‌లో ఇన్వెంటివ్-2024 టెక్నో ఫెయిర్ శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ మెగా టెక్నో ఫెయిర్‌ను ప్రారంభించారు. టెక్నో ఫెయిర్ ప్రారంభోత్సవంలో ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి, పాలకవర్గ చైర్మన్ బీవీఆర్ మోహన్ రెడ్డి, కేంద్ర విద్యాశాఖ కార్యదర్శి సంజయ్‌మూర్తి, ఐఐటీ డీన్ చంద్రశేఖర్ శర్మ, సూర్యకుమార్ పాల్గొన్నారు. ఇన్నోవేషన్ ఫెయిర్ ప్రారంభించన అనంతరం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రదాన్ మాట్లాడుతూ రెండో విడత ఇన్వెంటివ్ టెక్నోఫెయిర్ ఐఐటీ హైదరాబాద్‌లో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. 53పైగా సాంకేతిక విద్యాసంస్థలు టెక్నోఫెయిర్‌లో పాల్గొని 120 కొత్త ఆవిష్కరణలు ప్రదర్శించటం అభినందనీయమన్నారు. టెక్నో ఫెయిర్‌తో పారిశ్రామికవేత్తలు పరిశోధన రంగంలో మరింత పెట్టుబడులు పెరిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఐఐటీలు, ఐఐఐటీలు, ఎన్ఐటీలు ఇతర కేంద్ర సాంకేతిక విద్యాసంస్థలు ప్రదర్శించిన ఆవిష్కరణలను తిలకించారు.

కంది ఐఐటీహెచ్‌లో ఏర్పాటు చేసిన టెక్నో ఫెయిర్ స్టాల్స్

ఆకట్టుకున్న నూతన ఆవిష్కరణలు

టెక్నో ఫెయిర్‌లో ప్రదర్శించిన నూతన ఆవిష్కరణలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. దేశంలోని వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చిన ఐఐటీ, ఐఐఐటీ, ఎన్ఐటీ ఇతర సాంకేతిక విద్యాసంస్థల పరిశోధకులు, విద్యార్థులు ఆవిష్కరణలను ప్రదర్శించారు. వైద్యం, వ్యవసాయం-ఫుడ్ ప్రాసెసింగ్, రక్షణ-అంతరిక్షం, పరిశ్రమలు-వాతావరణ మార్పులు, సుస్థిరమైన టెక్నాలజీ అంశాల్లో 53 సాంకేతిక విద్యాసంస్థలు 120 నూతన ఆవిష్కరణలను ప్రదర్శించారు. సైయంట్, హానీవెల్, అప్లైడ్ మెటీరియల్స్, భారత్ ఫోర్జ్ లిమిటెడ్, ఐసీఐసీఐ, సీనర్జీ, సన్‌ఫార్మా, సుజుకి మోటర్స్, బాష్, ప్లైడర్ ఎలక్ట్రికల్స్, ఎన్‌టీపీసీ తదితర పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు. రక్షణ శాఖ అధికారులు, డీఆర్‌డీవో, డీఆర్ఎల్ తదితర సంస్థల ప్రతినిధులు టెక్నో ఫెయిర్‌కు హాజరయ్యారు. మెగా టెక్నోఫెయిర్‌కు 23మంది ఐఐటీ డైరెక్టర్లు, ఎన్ఐటీ డైరెక్టర్లు, ఐఐఐటీ డైరెక్టర్లు, ప్రొఫెసర్లు హాజరయ్యారు.

ప్రమాదాలు పసిగట్టే టెర్రా రోబో

పరిశ్రమల్లోని పైపులైన్లలో, గ్యాస్ లీకేజీల గుర్తింపు, దీంతో సంభవించే ప్రమాదాలను గుర్తించేందుకు ఐఐటీ కాన్పూర్‌కు చెందిన అవినాష్ భాస్కర్, అమ్రితాంషు స్వాన్-ఎం2 పేరిట టెర్రా రోబోను తయారుచేశారు. పరిశ్రమలు, పైపులైన్లలో మనుషులు వెళ్లలేని ప్రాంతాల్లోకి టెర్రారోబోను పంపొచ్చు. పైపు, గ్యాస్ లైపులైన్లలో లీకేజీలు టెర్రా రోబోతో సులువుగా గుర్తించి, వెంటనే మరమ్మతులు చేయవచ్చు.

పొగమంచుతో మొక్కల పెంపకం

నీటి వృథాను అరికట్టి పొగమంచుతో మొక్కలను పెంచే నూతన టెక్నాలజీని వీఐటీ వెల్లూరుకు చెందిన నరేంద్ర వర్మ బృందం అభివృద్ధి చేసింది. పొగమంచు ద్వారా మొక్కలను పెంచే ఫాగ్‌పోనిక్స్ యంత్రాన్ని తయారుచేశారు. మొక్కలకు అవసరమైన నీటిని, ఖనిజాలను పొగమంచు రూపంలో అందజేస్తారు. నీరు ఆదాతోపాటు మొక్కలకు చీడపీడలు సంక్రమించవు. తక్కువ సమయంలో మిర్చి, ఆలుగడ్డ, పూలు పండించొచ్చని ఆవిష్కర్త నరేంద్రవర్మ తెలిపారు.

రోగనిరోధక శక్తి పెంచే న్యూట్రా- సూటికల్ క్యాప్సల్స్

మనుషుల్లో రోగ నిరోధక శక్తి పెంచేందుకు అవసరమైన క్యాప్సల్స్‌ను ఎన్ఐటీ నాగ్‌పూర్‌కు చెందిన ప్రొ.అనుపమాకుమార్, నృపుర్ శ్రీవాస్తవ, మనీషాశర్మ బృందం అభివృద్ధి చేసింది. పండ్లు, కూరగాయల పొట్టు నుంచి వేర్వేరు ప్రక్రియల ద్వారా యాంటాక్సిడెంట్లు, గ్యాలిక్ ఆసిడ్‌ను వేరు చేసి వాటితో న్యూట్రా సూటికల్స్ క్యాప్సల్స్‌ను తయారు చేశారు. వీటిని వినియోగించడంతో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఆరోగ్య సమస్యలకు దూరంగా ఉండొచ్చు. బంగాళాదుంప, దానిమ్మ పండ్ల పొట్టును ఉపయోగించి న్యూట్రా సూటికల్స్ క్యాప్సల్స్‌ను ఎన్ఐటీ నాగ్‌పూర్ అభివృద్ధి చేసింది. మరిన్ని కూరగాయల పొట్టు నుంచి ఈ క్యాప్సల్స్ తయారీ ప్రక్రియను కొనసాగిస్తున్నారు.

ప్రాజెక్టు గురించి వివరిస్తున్న నాగ్‌పూర్ బృందం

మోబిల్యాబ్‌తో ఇంటి వద్దే 25 రకాల రోగ నిర్ధారణ పరీక్షలు

ఐఐటీ గౌహతికి చెందిన సాహిల్ బృందం రూపొందించిన 'మోబిల్యాబ్' పరికరంతో ఇంటి వద్ద 25 రకాల రోగనిర్ధారణ పరీక్షలు చేసుకోవచ్చు. మోబిల్యాబ్ పరికరాన్ని ఎక్కడికైనా వెంట తీసుకెళ్లవచ్చు. ఫలితాలను వెంటనే మొబైల్ స్క్రీన్‌పై తెలుసుకోవచ్చు. దీని విలువ రూ.5 లక్షల వరకు ఉంటుంది. కిడ్నీ, లివర్, డయాబెటిక్ ఇతర పరీక్షలు ఇంటివద్దే చేసుకోవచ్చు. ఫలితాలు కచ్చితంగా ఉంటాయి.

పది నిమిషాల్లో ప్రొస్టేట్ క్యాన్సర్ గుర్తింపు

పది నిమిషాల్లో ప్రొస్టేట్ క్యాన్సర్‌ను గుర్తించేలా ఐఐటీ గోవాకు చెందిన డాక్టర్ బిదన్ ప్రమానిక్ బృందం అధునాతన సెన్సార్ ఆధారిత పరికరాన్ని రూపొందించింది. ప్రస్తుతం ప్రొస్టేట్ క్యాన్సర్ గుర్తించాలంటే వేర్వేరు పరీక్షలు చేయాల్సి ఉంటుంది. రోగ నిర్ధారణ పరీక్ష ఫలితాలు తెలుసుకునేందుకు 24 గంటలకుపైగా సమయం పడుతుంది. పది నిమిషాల్లో ప్రొస్టేట్ క్యాన్సర్‌ను గుర్తించే సెన్సార్ ఆధారిత పరికరాన్ని రూపొందించారు. ఈ పరికరంలో రక్తం నమూనాలు వేసిన పది నిమిషాల్లో ఫలితాలు వస్తాయి. దీంతోపాటు కోవిడ్ రోగ నిర్ధారణ ఫలితాన్ని 20 నిమిషాల్లో, హైపటైటీస్ రోగ నిర్ధారణ ఫలితాన్ని 20 నిమిషాల్లో తెలుసుకోవచ్చు.

మూత్రం నుంచి ఫర్టిలైజర్ తయారీ

మూత్రం నుంచి ఫర్టిలైజర్ తయారు చేసే కొత్త టెక్నాలజీని ఐఐటీ పాలక్కాడ్‌కు చెందిన డాక్టర్ ప్రవీణ్ బృందం అభివృద్ధి చేసింది. మనుషులు విసర్జించే మూత్రాన్ని శుద్ధిచేసి అమ్మోనియం పాస్ఫెట్ ఫర్టిలైజర్ తయారు చేసే రియాక్టర్(ఎలక్ట్రో కెమికల్ రీసోర్స్ రికవరీ రియాక్టర్)ను తయారు చేసింది. ఈ రియాక్టర్ 7.5 లీటర్ మూత్రం నుంచి 15 గ్రాముల అమోనియమ్ పాస్ఫెట్ ఫర్టిలైజర్‌ను తయారు చేస్తుంది. పాలక్కాడ్ అభివృద్ధి చేసిన రియాక్టర్‌తో కరెంటు ఉత్పత్తి అవుతుంది. ఈ కరెంటుతో లైట్లు వెలిగించడంతోపాటు ఫోన్లు చార్జింగ్ చేసుకోవచ్చు.

కృత్రిమ మేధతో ట్రాఫిక్ నియంత్రణ

కృత్రిమ మేధను ఉపయోగించి ట్రాఫిక్‌ను నియంత్రించే రియల్ టైమ్ ట్రాఫిక్ కంట్రోల్ వ్యవస్థను ఐఐటీ రూర్కీకి చెందిన అమిత్ అగర్వాల్ బృందం అభివృద్ధి చేసింది. మెట్రోపాలిటన్ సిటీలు, ఇతర పట్టణాల్లో ప్రస్తుత ట్రాఫిక్‌కు దృష్టిలో ఉంచుకుని జెట్‌సన్ జేవియర్ ఎన్ఎక్స్ టెక్నాలజీ ఉపయోగించి కృత్రిమ మేధతో పనిచేసే ట్రాఫిక్ నియంత్రణ వ్యవస్థను రూపొందించారు.

వృథా నీటి నుంచి లిక్విడ్ యూరియా తయారు

వృథా నీటి నుంచి లిక్విడ్ యూరియాను తయారు చేసే సాంకేతిక పరికరాన్ని ఐఐటీ తిరుపతికి చెందిన ప్రొఫెసర్ షిహాబుద్ది బృందం అభివృద్ధి చేసింది. పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్యకారక జలాలను ప్లాస్మా టెక్నాలజీతో శుద్ధి చేస్తారు. ఇలా శుద్ధిచేసిన జలాల నుంచి ప్రత్యేక పద్ధతితో నాన్‌థర్మల్ అట్మాస్పియరిక్ ఫొటో ప్లాస్మాను అభివృద్ధి చేసి లిక్విడ్ నైట్రేట్‌ను తయారు చేస్తారు. దీన్ని మొక్కలకు యూరియాలా వాడవచ్చు. లిక్విడ్ యూరియా వాడడంతో దిగుబడి పెరిగి పంట సాగు సమయం తగ్గుతుంది.

శానిటరీ ప్యాడ్స్‌తో వ్యాధులకు అడ్డుకట్ట

మహిళలకు మేలు చేసే సెల్యులాయిస్ నానోఫైబర్ శానిటరీ ప్యాడ్స్‌ను ఐఐటీహెచ్‌కు చెందిన డాక్టర్ చంద్రశేఖర్‌శర్మ, అమాన్ ఫాతిమా బృందం రూపొందించింది. ప్రస్తుతం లభించే శానిటరీ ప్యాడ్స్‌ను కాటన్, పాలిస్టర్ ఇతర మెటీరియల్‌తో తయారు చేస్తున్నారు. ఫర్టిలిటీ, చర్మ సమస్యలు, ఇతర హానికారక వ్యాధులు వచ్చే అవకాశాలున్నాయి. వీటిని అరికట్టేందుకు కొత్త సాంకేతిక పరిజ్ఞానం, సెల్యోలాయిస్ నానో ఫైబర్‌ను ఉపయోగించి తేలికపాటి శానిటరీ ప్యాడ్స్‌ను రూపొందించారు.

కార్‌టీ సెల్ థెరపీతో బ్లడ్ క్యాన్సర్‌కు చెక్

కార్-టీ సెల్ థెరపీతో బ్లడ్ క్యాన్సర్‌కు చెక్ పెట్టేలా కొత్త చికిత్సను ఐఐటీ బాంబేకు చెందిన డా.రాహుల్ పుర్వార్, అలియాఖాన్, స్వీటీ ఆసిజా బృందం కొనుగొన్నది. బ్లడ్‌క్యాన్సర్ సమస్య ఉన్నవారికి పలుమార్లు శుద్ధిచేసిన రక్తాన్ని ఎక్కించాల్సి ఉంటుంది. కార్-టీ సెల్ థెరపీలో రోగి నుంచి సేకరించిన రక్త కణాల నుంచి కొత్త కార్‌టీ సెల్స్‌ను అభివృద్ధి చేస్తారు. సెల్స్‌ను శుద్ధిచేసిన రక్తంలోకి చేర్చి రోగికి ఎక్కిస్తారు. దీంతో బ్లడ్‌క్యాన్సర్ సమస్య పూర్తిగా సమసిపోయి, మళ్లీ శుద్ధిచేసిన రక్తం రోగులకు ఎక్కించాల్సిన అవసరం ఉండదు. ఈ చికిత్స అమెరికాలో మాత్రమే అందుబాటులో ఉంది. బ్లడ్‌క్యాన్సర్ చెక్ పెట్టే చికిత్స మన దేశంలోనూ త్వరలో అందుబాటులోకి రానున్నది.